క్లుప్తంగా

ఉమ్రా యాత్రికులకు సత్కారం



ఉమ్రా యాత్రికులను సత్కరిస్తున్న జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కేవీ బాబా

తాటిచెట్లపాలెం: పవిత్ర పుణ్య క్షేత్రం మక్కా–మదీనాలను దర్శించుకునేందుకు ఈ నెల 11న బయల్దేరనున్న ఫతే అహ్మద్, నాగూర్ మీరాలను జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కేవీ బాబా ఆదివారం ఘనంగా సత్కరించారు. రైల్వే న్యూకాలనీలోని ఫతేఅహ్మద్, నాగూరుమీరాలను వారి స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానం చేశారు. వీరిద్దరూ ఈ పవిత్ర యాత్రను ముగించుకుని నవంబరు చివరి వారంలో విశాఖకు రానున్నారు. ఈ సందర్భంగా కేవీ బాబా మాట్లాడుతూ ఈ పవిత్ర ఉమ్రా యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు హైదర్ అలీ సింకా, హాజీ ఖాదర్ బాబా, బాదర్‌బాబా, జిలానీ, తాజుద్దీన్, కాలేష బాబా, బర్కత్ అలీ, షరీఫ్, రెహ్మాన్, వలి, చోటు, ఆయుబ్, ముస్తఫా, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఓటరు నమోదు ప్రక్రియ



ఓటు నమోదు చేస్తున్న బీఎల్‌వో తదితరులు

మత్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డులో ఓటరు నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఈ మేరకు వుడాకాలనీలోని నాలుగు పోలింగ్ బూత్‌లకు సంబంధించి రెండు రోజులపాటు వుడా కమ్యూనిటీ హాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం 100 మంది వచ్చి తమ ఓటు ఉందో లేదో ఆసక్తిగా తెలుసుకున్నారు. పలువురు కొత్తగా ఓటు నమోదు చేసుకున్నారని, మరికొందరు మార్పులు, చేర్పులు చేసుకున్నట్టు బీఎల్వో సూర్య తెలిపారు.

రైలు ప్రమాద బాధితులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు



చికిత్స పొందుతున్న బాధితునితో మాట్లాడుతున్న సభ్యులు

తాటిచెట్లపాలెం : రైలు ప్రమాద బాధితులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ బృంద సభ్యులు విశేష సేవలు అందిస్తున్నారు. వాల్తేర్ డివిజన్ కంటకాపల్లి–అలమండ వద్ద ఇటీవల రైలు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. విజయనగరం, విశాఖపట్నంలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు వాల్తేర్ డివిజన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ బృంద సభ్యులు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ బృంద సభ్యులు హాస్పటల్ వైద్యుల సూచనల మేరకు బాధితులకు ఎప్పటికప్పుడు సపర్యలు చేస్తూ, అవసరమైన మందులు, ఆహారం తీసుకోవడంలో సహకరిస్తున్నారు. వీరి సేవల పట్ల బాధిత కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నూతన కమిటీ

సీతంపేట: ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులుగా కె.రామమూర్తి, ప్రధాన కార్యదర్శిగా బోనెల రమేష్, కోశాధికారిగా పల్లా బాబ్జి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా అనుకుల జాన్, రాష్ట్ర సహాధ్యక్షులు, కార్యదర్శులుగా బి.యమున, కౌసల్య, సాగర్, రామారావు, మనోజ్, సుదర్శన్, శేషగిరి, పెంచలయ్య, సత్యనారాయణ, విజయ్‌రాజ్, కిరణ్‌కుమార్, వినోద్, జి.వి.నారాయణ, కె.త్రినాథరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సామల సింహాచలం, వెంకటస్వామి, మట్ట అప్పారావు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

ద్వారకా ఏసీపీ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి



నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ విజయ్‌కుమార్



ద్వారకా పోలీస్ స్టేషన్‌లో పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి

సీతమ్మధార : నగరంలో అల్లర్లు సృష్టించే రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ద్వారకా ఏసీపీ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి హెచ్చరించారు. ద్వారకా పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ రాత్రి 9 గంటలకు ఇంటి వద్ద ఉండాలని, మద్యం సేవించి గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరు పనుల్లో వారు ఉండాలని, ఎక్కడ పని చేస్తున్నారో పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. తగాదాల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిత్యం పోలీసు నిఘా ఉంటుందన్నారు. అనంతరం రౌడీషీటర్లను ఇంటికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కార్యక్రమంలో ఎస్ఐ ధర్మేంద్ర, అప్పలరాజు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ..
ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు సీఐ ఎస్.విజయకుమార్ కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చవద్దన్నారు. హత్య కేసులో ఉన్నవారు, అత్యాచారం కేసులో ఉన్న వారి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. సోమవారం నుంచి 12వ తేదీ వరకు గుంటూరు–రాయగడ (17243)ఎక్స్‌ప్రెస్, మంగళవారం నుంచి 13వ తేదీ వరకు రాయగడ–గుంటూరు (17244)ఎక్స్‌ప్రెస్, మంగళవారం నుంచి 12వ తేదీ వరకు మచిలీపట్నం–విశాఖ (17219) ఎక్స్‌ప్రెస్,13వ తేదీ తేదీ వరకు విశాఖ–మచిలీపట్నం (17220)ఎక్స్‌ప్రెస్, 12వ తేదీ తేదీ వరకు విజయవాడ– విశాఖ– విజయవాడ (12718/12717) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 12వ తేదీ తేదీ వరకు కాకినాడ–విశాఖ– కాకినాడ (17267/17268) స్పెషల్ రైళ్లు రద్దు చేశారు.

గమ్యం కుదించిన రైళ్లు
సోమ,మంగళవారాల్లో విశాఖలో బయల్దేరే విశాఖ–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరవలసిన కిరండూల్–విశాఖ(18513)ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8, 9తేదీల్లో కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. సోమ,మంగళవారాల్లో హౌరాలో బయల్దేరే హౌరా – జగదల్‌పూర్ (18005)సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరాల్సిన జగదల్‌పూర్ – హౌరా(18006) ఎక్స్‌ప్రెస్‌గా 7,8 తేదీలలో కోరాపుట్ నుంచి బయల్దేరి హౌరా చేరుకుంటుంది.

నాందేడ్ –విశాఖపట్నం రీషెడ్యూల్
ఆదివారం నాందేడ్‌లో సాయంత్రం 4.30గంటలకు బయల్దేరవలసిన నాందేడ్–విశాఖ(20812) సూపర్‌ఫాస్ట్ స్పెషల్ పెయిరింగ్‌రైలు రాక ఆలస్యంగా రాత్రి 8.30గంటలకు బయల్దేరింది.

రూ.9.46 లక్షల నగదు, 4 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార : గురుద్వారా ప్రాంతంలో ద్వారకా పోలీస్ స్టేషన్ ఎస్ఐ అప్పలరాజు, సిబ్బంది 4 కిలోల గంజాయి, రూ.9.46 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. గురుద్వారా వద్ద ఆదివారం బ్యాగులతో పెదబయలు మండలం జాముగూడ గ్రామానికి చెందిన కిల్లో మధుబాబు, కొర్రా భాస్కరరావు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారి వద్ద నుంచి రూ.9.46 లక్షలు, 4 కిలోల గంజాయి, బైక్, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరికి సహకరించిన మరో ముగ్గురు కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిందితులిద్దరిపై కూడా గతంలో గంజాయి అక్రమ తరలింపు కేసులు ఉన్నాయి.

ముగిసిన నిఘా వారోత్సవాలు



మాట్లాడుతున్న ఏయూ ప్రొఫెసర్ కృష్ణమోహన్

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ పరిధిలో నిఘా వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. అవినీతికి అలవాటు పడితే జీవితాలు, కుటుంబాలు ఎలా నష్టపోతాయో ఏయూ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ వివరించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, డిబేట్, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ రైల్వే అధికారులు, సిబ్బందితో భేటీ అయ్యారు. అవినీతికి అలవాటు పడి జీవితాలు ఎలా నాశనం అయ్యాయో నుక్కడ్–నాటక్ వీధినాటికల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఆర్ ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న విశాఖ టైల్స్ అండ్ శానిటరీ వేర్ అసోసియేషన్ సభ్యులు

సీతమ్మధార : విశాఖ టైల్స్ అండ్ శానిటరీ వేర్ అసోసియేషన్ తరపున ప్రతి ఆరు నెలలకు ఒకసారి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందని అసోసియేషన్ అధ్యక్షుడు ఏవీ రామకృష్ణారావు అన్నారు. 27వ వార్డు శ్రీనగర్‌లో ఆదివారం ఉచిత మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కిడ్నీ బాధితుడికి, క్యాన్సర్ పేషెంట్‌కి ఆర్థిక సహాయం చేశామన్నారు. రక్తదానం చేయడానికి తమ అసోసియేషన్ సభ్యులు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ ఎస్.శ్రీనివాసరావు, కోశాధికారి సంజయ్, ప్రతినిధులు రామోజీరావు, బద్రిప్రసాద్, ఆసిఫ్ అలీ, ఆర్‌కే ప్రసాద్, నాగేశ్వరరావు, రాజా, రమణవర్మ, శేషు, నాగరాజు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే ఎన్‌పీఎస్ రద్దు



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వికాస్ రావల్

డాబాగార్డెన్స్ : నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్) వల్ల కార్మికులకు ఎటువంటి లాభం లేకపోగా నష్టమేనని జేఎన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వికాస్ రావల్ అభిప్రాయపడ్డారు. పీపుల్ ఫర్ ఇండియా విశాఖపట్నం ఆధ్వర్యంలో ఆదివారం ఎల్ఐసీ ప్రాంగణంలో ఎన్‌పీఎస్ రద్దు–అందరికీ ఓపీఎస్ పేరిట సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 2004 వరకు ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం అమలయ్యేదని, అది కూడా చాలా పోరాటాల ఫలితంగానే వచ్చిందన్నారు. ప్రభుత్వం మాత్రం ప్రజలకు సామాజిక భద్రతగా పెన్షన్ అందించే బాధ్యత నుంచి వైదొలుగుతుందన్నారు. ఎన్‌పీఎస్ జమ అయిన నిధులను స్టాక్‌మార్కెట్‌లో, ప్రైవేట్ సంస్థల చేతుల్లో పెడుతుందన్నారు. ఎంత పెన్షన్ వస్తుందో కూడా తెలియని అయోమయంలో ప్రజలు ఉన్నారన్నారు. ఐక్య పోరాటాల వల్ల మాత్రమే ఎన్‌పీఎస్ రద్దు, ఓపీఎస్ సాధన సాధ్యమన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజాశర్మ, జి.వరప్రసాద్, అప్పారావు, అరుణ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ సదస్సులో ఎం. కామేశ్వరి, ఎస్. రామకృష్ణ, ఏవీఆర్‌కే మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో మత్స్యకారులకు గుర్తింపు



కోలా గురువులును సత్కరిస్తున్న వాడబలిజ సంఘం నాయకులు

జగదాంబ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారులకు ప్రత్యేక గుర్తింపునిచ్చారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. ఆదివారం జీవీఎంసీ 39వ వార్డు ఎంవీడీఎం పాఠశాల ఎదురుగా ఉన్న వాడబలిజ సంఘం భవనానికి ప్రారంభోత్సవం చేసిన ఆయనను ఆ సంఘం పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ మత్యకారులకు ఎటువంటి సహాయం కావల్సి వచ్చినా అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లో భారీ చోరీ



ఇంట్లో చిందర వందరగా పడి ఉన్న వస్తువులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని క్వార్టర్స్‌లో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్ విభాగంలో సీనియర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. శ్రీనివాస్ టౌన్‌షిప్ సెక్టార్–1లోని 149–డీ క్వార్టర్‌లో కుటుంబంతో నివశిస్తున్నారు. యథావిధిగా శనివారం రాత్రి తలుపులు వేసిపడుకున్నారు. తెల్లవారి లేచి చూడగా ఇంటి హాల్లో వస్తువులు చిందర వందరగా పడిఉన్నాయి. ప్రధాన ద్వారం ముందు వైపు గడియ పెట్టి ఉంది. తనిఖీ చేయగా ఇంట్లో ఉండాల్సిన సుమారు 10 నుంచి 12 తులాల బంగారం వస్తువులు, 10 తులాల వెండి వస్తువులు, రెండు మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ మాయమయ్యాయి. దీంతో వారు స్టీల్‌ప్లాంట్ పోలీసులకు సమాచారం అందించారు. క్రైం ఎస్ఐ ఎల్. శ్రీనివాసరావు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. క్లూస్ టీంకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వేలిముద్రలు సేకరించారు. దొంగలు దిగువున ఉన్న పైపును పట్టుకుని పైఅంతస్తుకు వచ్చి వెనుక ద్వారం గుండాలోనికి ప్రవేశించినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఉద్యోగి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయండి



విద్యా సంస్థల బంద్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

మద్దిలపాలెం : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రక్రియను ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8వ తేదీన తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మధురెడ్డి పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మద్దిలపాలెం సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అదానికి కట్టబెట్టేందుకు కుట్ర పన్నుతుందన్నారు. దీన్ని తిప్పికొట్టేందుకు అన్ని వర్గాల ప్రజల ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణకు దీక్షలు తలపెట్టి 8వ తేదీ నాటికి వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా విద్యార్థుల సహాయంతో విద్యా సంస్థల బంద్ తలపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి అశోక్, ఈగల రమణ, కె.మధు, శ్రీను, సంతోష్ పాల్గొన్నారు.

ఘనంగా ఆర్యవైశ్య యువజన సంఘం వార్షికోత్సవం

డాబాగార్డెన్స్ : ఆర్యవైశ్య యువజన సంఘం గోల్డెన్ జూబ్లీ వార్షికోత్సవం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 50 ఏళ్ల కిందట అప్పటి సంఘ పెద్దలు ముందు చూపుతో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య యువజన సంఘం ఎదుగుతూ సంఘ ఆశయాలు ముందుకు తీసుకెళ్తుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నల్లూరి సూకరాజు, కార్యదర్శి పూసర్ల సురేష్‌కుమార్, ప్రోగ్రామ్ చైర్మన్ వి. శ్రీనివాసరావు, సంఘం కోశాధికారి గ్రంధి దుర్గాప్రసాద్, ఆరిశెట్టి దినకర్, రామకృష్ణారావు, శివకుమార్, ఉప్పల భాస్కరరావు, విన్నకోట రామ్మూర్తి, కందుల మూర్తి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దామోదర ఉత్సవాలు

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో కార్తీక దామోదర మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథ స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం మంగళ హారతితో ప్రారంభమై గోపిగీత, భగవద్గీత 12వ అధ్యాయం, శిష్టాష్టకం పారాయణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

రైతుబజార్‌లో జోరుగా మరమ్మతులు



ఆర్వో రూమ్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

సీతంపేట: నరసింహనగర్ రైతుబజార్‌లో మరమ్మతులు జోరుగా జరుగుతున్నాయి. ఇటీవల రైతుబజారులో స్టాల్స్ అన్నింటికీ పైకప్పుగా ఉన్న సిమ్మెంట్ రేకులు తొలగించి వాటి స్థానంలో స్టీల్ రేకులు వేశారు. నడిచే మార్గంలో ప్యాచ్ వర్క్‌లు చేస్తున్నారు. స్టాల్స్ మధ్య శిథిలమైన గోడలను తిరిగి నిర్మిస్తున్నారు. ఆర్వో రూమ్‌కు డోర్ ఏర్పాటు చేశారు. టాయిలెట్లు, చేతులు శుభ్రం చేసుకునే వాషింగ్ ఏరియా, ఆర్వో వాటర్ ఏరియాలో టైల్స్ వేస్తున్నారు. టాయిలెట్ రూమ్‌పై ఉన్న ఆర్వో వాటర్ ట్యాంకు కింద సిమెంట్ దిమ్మ నిర్మించారు. శిథిలమైన టాయిలెట్ వాటర్ ట్యాంకు స్థానంలో కొత్తది ఏర్పాటు చేశారు. మరోవైపు రైతుబజార్‌లో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని పలువురు వినియోగదారులు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార : ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందామని చిట్టివలస లేబర్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న నిరాహారదీక్ష 946వ శిబిరానికి హాజరై ఆయన మాట్లాడారు. నగరంలోని అఖిలపక్ష కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, మేధావులు అందరూ ఒక తాటిపైకి వచ్చి పోరాడుతున్నారన్నారు. లాభాల్లో నడుస్తున్న ప్లాంట్‌ను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఉన్న ఉద్యోగాలు పోవడంతో పాటు ముందు తరాలకు ఉపాధి ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ అమ్మకానికి పెట్టి దేశాన్ని దివాళా తీయిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, నూలు ఆదినారాయణ, చిల్లరాం, వై.కొండయ్య, సూరప్పుడు తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనా - ఇజ్రాయెల్ మధ్య శాంతి అవసరం



మౌనం పాటిస్తున్న నరవ ప్రకాశరావు, ఎంవీఎస్ శర్మ తదితరులు

సీతంపేట: పాలస్తీనా–ఇజ్రాయెల్ మధ్యపై శాంతిని నెలకొల్పాల్సిన బాధ్యత ఐక్యరాజ్య సమితిపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. టీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం, వైజాగ్ ఎన్జీవో ఫోరం సంయుక్తంగా పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడి, ఐక్యరాజ్య సమితి పాత్ర అనే అంశంపై ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సదస్సు నిర్వహించారు. సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, లా యూనివర్సిటీ పూర్వ వీసీ సుధ, ట్రస్ట్ ఇండియా చైర్మన్ పి.కె.జోస్, ప్రజ్ఞాన్ కుమార్ వక్తలుగా పాల్గొని ముందుగా సర్వమత ప్రార్థనలు, దాడిలో చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిలో ఇప్పటికే 7 వేల మంది మహిళలు, పసిపిల్లలు చనిపోయారన్నారు. ఐక్యరాజ్య సమితి తీర్మానానికి ఇజ్రాయెల్ కట్టుబడి ఉండాలన్నారు. సామ్రాజ్యవాద దేశాలు ఇజ్రాయిల్ దాడిని సమర్థిస్తున్నాయని, తక్షణమే యుద్ధం ఆపి శాంతికి కట్టుబడి ఉండాలని కోరారు. ఐక్యరాజ్యసమితి తీర్మానంలో భారతదేశం తటస్థంగా ఉండటం శోచనీయమన్నారు. ఈ చర్య దేశ అలీన విధానానికి అనుగుణంగా లేదని, తీవ్రవాదాన్ని, ఉగ్రవాదాన్ని, మత మౌఢ్యాన్ని అన్ని దేశాలు వ్యతిరేకించాలని తీర్మానం చేశారని గుర్తుచేశారు. ఇప్పటికైనా పాలస్తీనాపై కొనసాగుతున్న దాడిని ఆపే విషయంలో ఐక్యరాజ్య సమితి మరింత చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో గౌరీశంకర్, చాట్ల బాబూరావు, హుస్సేన్, ప్రభు, అనూరాధ, సురేష్ పాల్గొన్నారు.

వెల్‌కమ్ టు ఎన్ఏడీ



ఫ్లైఓవర్

- నగరానికి తలమానికంగా ఎన్ఏడీ ఫ్లైఓవర్
- ఆకట్టుకునేలా గ్రీనరీ



ఫ్లైఓవర్ మధ్యలో నడక దారి

విశాఖ విద్య: ఎన్ఏడీ అంటే కొన్నాళ్ల వరకు వాహనదారులు వణికి పోయే వారు. ట్రాఫిక్‌లో చిక్కుకొని విలవిల్లాడేవారు. ఇప్పుడు ఆ కష్టాలు గట్టెక్కాయి. ఎంచక్కా ప్రయాణం సాగుతోంది. కోస్తా జిల్లాల నుంచి విశాఖ నగరానికి వచ్చే వారితో పాటు వాయుమార్గంలో వచ్చేవారికి ఎన్ఏడీ ఫ్లై ఓవర్ వెల్‌కమ్ చెబుతోంది. నగరానికి తలమానికంగా మారింది. విశాఖ నగరం నుంచి స్టీల్ ప్లాంట్, ఎయిర్‌పోర్ట్, విశాఖ డెయిరీ, ఆటోనగర్‌లో పరిశ్రమలకు వెళ్లి వచ్చే వారితో పాటు రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు ఎన్ఏడీ మీదుగానే ప్రయాణం చేయాలి. దీంతో ఎన్ఏడీ సెంటర్ అనునిత్యం వాహనాలు, ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యం గల ఎన్ఏడీ సెంటర్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. రూ.150 కోట్లతో 2017లో ఫ్లై ఓవర్ నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన చేశారు. అయితే ఏమాత్రం శ్రద్ధ తీసుకోలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు.

ఆకర్షణీయంగా పరిసరాలు
మరో వైపు ఫ్లైఓవర్ కింద ప్రాంతాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ప్రయాణికులు సేదతీరడానికి ఏర్పాట్లు చేశారు. పచ్చదనం కోసం మొక్కలు పెంచుతున్నారు.

ఎన్ఏడీకి ఆ పేరు ఎలా వచ్చిందంటే
ఎన్ఏడీ అంటే నేవల్ ఆర్మమెంట్ డిపో. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని ఈ డిపోలో నౌకలకు మందుగుండు సామగ్రి, టార్పెడోలు, క్షిపణులు, గనులు, బాంబులు, రాకెట్లు మరియు ఇతర పేలుడు వస్తువులు సేకరణ, నిల్వ వంటి కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అందుకే ఎన్ఏడీ సెంటర్ ప్రాచుర్యం పొందింది. ఇక్కడే నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్ఎస్‌టీఎల్) కూడా ఉంది.

అంబేడ్కర్ సాక్షిగా..
ఎన్ఏడీ కూడలిలో సంజీవయ్య నగర్ వాసుల సౌజన్యంతో 2008లో అప్పటి కార్పొరేటర్, ప్రస్తుత డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆవిష్కరించారు. విస్తరణ నేపథ్యంలో ఇదే చోట 16 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. ఎన్ఏడీ ఫ్లైఓవర్‌తో సమాంతరంగా ఈ విగ్రహం ఉండడం విశేషం.

సొగసు చూడతరమా
విశాఖ నగరానికి స్వాగత ద్వారంగా నిలిచే ఫ్లైఓవర్ డిజైన్ చూడముచ్చటగా ఉంటుంది. సినిమా సెట్టింగ్ మాదిరి కనిపిస్తోంది. నాలుగు దారుల్లో రాకపోకలు సాగించే పాదచారుల కోసం ఫ్లైఓవర్ మధ్యలో నడకదారి ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరుగకుండా ఫ్లైఓవర్ పైన ఇరువైపులా బౌట్ పోస్టులను సైతం ఏర్పాటు చేసి, 24 గంటల పాటు ట్రాఫిక్ పోలీసులు విధుల్లో ఉండేలా తగిన ఏర్పాట్లు చేశారు.